దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం వ్యవసాయం, జనవరి 22: స్వయం ఉపాధి నిమిత్తం దివ్యాంగులకు రుణాలు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి కే.రాంగోపాల్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 వేల పూర్తి సబ్సిడీతో జిల్లాకు 24 యూనిట్లు మంజూరైనట్లు వివరించారు. అర్హులు ఈ నెల 23 నుంచి ఫిబ్రవరి 2లోపు http//tgobmms.cgg.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అడసర్లపాడులో డీసీసీబీ నూతన బ్రాంచి ఏర్పాటు

ఖమ్మం వ్యవసాయం, జనవరి 22: ఖమ్మం డీసీసీబీలో మరో నూతన బ్రాంచి అందుబాటులోకి వచ్చింది. ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో విస్తరించిన ఉన్న ఖమ్మం డీసీసీబీ పరిధిలో ప్రస్తుతం 50 బ్రాంచీలు ఉన్నాయి. అయితే నూతనంగా వేంసూరు మండలం అడసర్లపాడులో నూతన బ్రాంచి ఏర్పాటు కాబోతున్నది. కాగా, ఈ బ్రాంచి మంజూరు కోసం ప్రత్యేక చొరవ తీసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారావుకు డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రైస్‌మిల్లును తొలగించాలి

కొణిజర్ల, జనవరి 22: మండల కేంద్రమైన కొణిజర్ల ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న శ్రీనివాస రైస్‌మిల్లును తొలగించాలని స్థానిక కాలనీవాసులు రైస్‌మిల్లు ఎదుట ఆందోళన చేపట్టారు. రైస్‌మిల్లు నిర్వహణ వల్ల దుమ్ముదూలి చేరి కాలనీవాసులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారని స్థానికులు ఆందోళన చేశారు.

ఆయిల్ పాం రైతులను ఆదుకోవాలి

సత్తుపల్లిటౌన్, జనవరి 22: సమగ్ర విచారణ చేపట్టి నష్టపోయిన ఆయిల్ పాం రైతులను ఆదుకోవాలని అశ్వారావుపేట జోన్ ఆయిల్‌ఫాం గ్రోయర్స్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి వై.పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఆయిల్‌ఫెడ్ ఆఫీసులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తంబా రకానికి సుమారు 3 లక్షల మొక్కలను ఒక బ్యాచ్‌లో పెంచగా హాఫ్‌టైప్ మొక్కలుగా మిగిలిపోయాయని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో రైతులు చెలికాని సూరిబాబు, ఆళ్ల నాగేశ్వరరావు, మోరంపూడి శ్రీనివాసరావు, రావుల రాజబాబు, సోమిరెడ్డి, చక్రధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు రాగి జావ

ఖమ్మం అర్బన్, జనవరి 22: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం రాగి జావ అందించే కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలోని కొన్ని కళాశాలల్లో బుధవారమే అందజేసినప్పటికీ జిల్లాలోని 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు గురువారం నుంచి పూర్తిస్థాయిలో అందించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాధికారి కే.రవిబాబు తెలిపారు.

'అర్హులకే అందించాలి'

వైరాటౌన్, జనవరి: అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించాలని సీపీఐ ఎంఎల్ (మాస్‌లైన్) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీవై.పుల్లయ్య, వైరా డివిజన్ కార్యదర్శి కె.అర్జున్‌రావు, మండల కార్యదర్శి యలదండి బాబు డిమాండ్ చేశారు. బుధవారం వైరాలోని విక్రమ్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పైరవీకారులను గ్రామసభల్లోకి రానివ్వకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

రఘునాథపాలెంలో కాంగ్రెస్ నేతలపై తిరగబడుతున్న ప్రజలు

కూసుమంచి : మళ్లీ సర్వే చేయాలని పోచారం గ్రామసభలో అధికారులను నిర్బంధించిన గ్రామస్తులు

రెండోరోజూ అదే ఆందోళన

- దరఖాస్తుదారుల నినాదాలతో దద్దరిల్లిన గ్రామసభలు
- మమ్మల్ని ఎందుకు రిజక్ట్ చేశారో తెలపాలని డిమాండ్
- పోచారంలో అధికారుల నిర్బంధం.. కిటికీల ధ్వంసం
- చింతకాని మండలంలో సెల్‌టవర్ ఎక్కిన బాధితుడు

నాలుగు పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలు ఖమ్మంజిల్లా వ్యాప్తంగా బుధవారం రెండోరోజూ దరఖాస్తుదారుల ఆందోళనలతో దద్దరిల్లాయి. ప్రజాపాలన సభలా.. కాంగ్రెస్ నాయకుల సమావేశమా అని సీపీఎం నాయకులు, దరఖాస్తుదారులు అధికారులను నిలదీసిన పరిస్థితి మధిరలో చోటుచేసుకుంది. సర్వే తప్పులతడకగా ఉందని, మళ్లీ సర్వే చేయాల్సిందేనని కూసుమంచి మండలం పోచారం గ్రామస్తులంతా తీర్మానం చేశారు. అధికారులను గ్రామ పంచాయతీ భవనంలో నిర్బంధించారు. పోలీసుల చొరవతో వారు బయటకు వచ్చారు. పంచాయతీ కార్యాలయ కిటికీల అద్దాలను పగులగొట్టారు. ఖమ్మం రూరల్ మండలం యం.వెంకటయపాలెం, ఆరెంపుల, కొండాపురం, ఆరెకోడుతండా, గొల్లగూడెం, పొన్నెకల్ గ్రామాల్లో సీపీఎం, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్, బీఆర్ఎస్, సీపీఐ పార్టీ నాయకులు లబ్ధిదారుల జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఏకపక్షంగా జాబితా తయారు చేశారని, మిగిలిన వారిని ఎందుకు రిజెక్టు చేశారో తెలపాలని వాదించారు. కూసుమంచి మండలంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. జీళ్లచెరువులో తహసీల్దార్ కరుణశ్రీ మాట్లాడుతుండగా ప్రజలు అడ్డుతగిలారు. తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లిలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాషబోయిన వీరన్న ఆధ్వర్యంలో ప్రజలు నిరసన తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదాలు జరిగాయి. మేకలతండా సభలో తహసీల్దారు రామకృష్ణను గిరిజనులు నిలదీశారు. చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో పామర్తి శ్రీను సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. లచ్చగూడెంలో అధికారులను దళిత మహిళలు నిలదీశారు. మండల కేంద్రమైన రఘునాథపాలెంలో అర్హుల పేర్లు గల్లంతు కావడంతో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. పోలీసులు జోక్యం చేసుకొని సభను నిర్వహించే ప్రయత్నం చేసినప్పటికీ అధికారులు చేతులెత్తేశారు. చిమ్మపూడి, రాంక్యాతండాల్లోనూ ఇదే తరహాలో అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ఖమ్మం నగరంలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొన్నది. 21వ డివిజన్ నుంచి 40వ డివిజన్ వరకూ ప్రత్యేకాధికారులు వార్డు సభలు నిర్వహించారు. జాబితాలో అర్హుల పేర్లు లేకపోవడంతో డివిజన్ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. 22వ డివిజన్ వార్డుసభలో కేఎంసీ కమిషనర్ అభిషేక్‌ను డివిజన్ ప్రజలు చుట్టుముట్టారు. - నమస్తే నెట్‌వర్క్

ఖమ్మం రూరల్ : తహసీల్దార్ ఎదుట ఆందోళన చేస్తున్న యం.వెంకటాయపాలెం గ్రామ ప్రజలు

వైరాటౌన్ : వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

కూసుమంచి(నేలకొండపల్లి) : మంగాపురంతండాలో గ్రామసభలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

మధిర(చింతకాని) : గ్రామసభలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు మధ్య వాగ్వాదం

తిరుమలాయపాలెం : జల్లేపల్లిలో అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరన్న, ప్రజలు

వేంసూరు : కందుకూరు గ్రామసభలో ప్రజలను అడ్డుకుంటున్న పోలీసులు

కారేపల్లి : కోమట్లగూడెం గ్రామసభలో అధికారుల ముందే కొట్లాడుకుంటున్న దరఖాస్తుదారులు

పెనుబల్లి : కల్లూరు మండలం కొర్లగూడెంలో ఆర్డీవోను అడ్డుకుంటున్న గ్రామస్తులు

సత్తుపల్లిటౌన్ : తమకు పథకాలు అమలు కాకపోవడంపై అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు

జేఈఈ మెయిన్స్ పరీక్షలు షురూ..

ఖమ్మం అర్బన్, జనవరి 22 : ఐఐటీ పరీక్షల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆన్‌లైన్ విధానంలో రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఐదు కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం సెషన్‌లో 771 మందికి.. 753 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో 771 మందికి.. 759 మంది హాజరయ్యారు. రెండు సెషన్లలో మొత్తం 30 మంది గైర్హాజరైనట్లు పరీక్షల కో ఆర్డినేటర్ రామసహాయం పార్వతిరెడ్డి తెలిపారు. పరీక్ష కేంద్రాలను ఆమె పరిశీలించారు. విద్యార్థులను మెటల్ డిటెక్టర్‌లతో తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. పరీక్ష రాసే విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

'జాబితాలో పేరు లేదని ఆందోళన వద్దు'

ఖమ్మం, జనవరి 22: పథకాల అర్హుల జాబితాలో పేర్లు లేని వారెవరూ ఆందోళన పడొద్దని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. అర్హులందరికీ నాలుగు పథకాలను అందించనున్నట్లు తెలిపారు. ఖమ్మం 28వ డివిజన్ ప్రకాశ్‌నగర్‌లో బుధవారం నిర్వహించిన వార్డులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు లబ్ధిని చేకూరుస్తామని అన్నారు. అనంతరం డివిజన్ ప్రజల సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

మధిర పీహెచ్‌సీ తనిఖీ

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టాక్‌ను పరిశీలిస్తున్న సైదులు

మధిర, జనవరి 22 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఖమ్మం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బెజవాడ సైదులు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గల ఫార్మసీ డ్రగ్‌స్టాక్ బోర్డు, ఫార్మసీ వ్యాక్సినేషన్ రిజిష్టర్లు, ఐఎల్ఆర్ రూం తనిఖీ చేసి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ స్రవంతి, సీహెచ్‌వో పీ.శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్ దానయ్య, నర్సింగ్ ఆఫీసర్ ఉదయశ్రీ, ఎల్‌టీ చంద్రశేఖర్, ఫార్మాసిస్ట్ రాధాలత, ఎల్‌టీ యాకుబ్, నాగరాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

మంత్రి పొంగులేటి

కూసుమంచి(నేలకొండపల్లి), జనవరి 22 : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని, మొదటి జాబితాలో పేరు రానివారు బాధపడాల్సిన అవసరం లేదని, మళ్లీ గ్రామసభలు ఏర్పాటు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేలకొండపల్లి మండలంలో బుధవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామసభల్లో అనేక మంది జాబితాల్లో తమ పేర్లు రాలేదని ఫిర్యాదులు వస్తున్నాయని, మళ్లీ కొత్తగా దరఖాస్తులు చేసుకోవాలని తిరిగి సర్వే చేసి ఇస్తామన్నారు. ప్రతి పేదవాడికి రేషన్‌కార్డులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మువ్వా విజయ్‌బాబు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిపై నమ్మకం కల్పించాలి

ఖమ్మం పెద్దాసుపత్రి తనిఖీలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం సిటీ, జనవరి 22: వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించి ప్రభుత్వాసుపత్రిపై నమ్మకం కల్పించాలని స్థానిక వైద్యాధికారులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. పెద్దాసుపత్రిలో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దవాఖానకు వచ్చిన రోగులతో మమేకమై అక్కడ అందుతున్న సేవలు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే వాహనాల పార్కింగ్, హాస్పిటల్ ప్రధాన గేటు బయట వాహనాల రద్దీ నియంత్రణ, ప్రధాన మార్గం ఆర్చీ నిర్మాణ విషయమై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రికి అవసరమైన వైద్య పరికరాలు, సౌకర్యాల కల్పన గురించి ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు.

రెజొనెన్స్ విద్యార్థినులను అభినందిస్తున్న కలెక్టర్

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

మామిళ్లగూడెం, జనవరి 22: గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర వేడుకలకు చేయాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.

రెజొనెన్స్ శ్రీనగర్ విద్యార్థినులకు కలెక్టర్ అభినందన

ఖమ్మం అర్బన్, జనవరి 22: ఖమ్మంలోని రెజొనెన్స్ శ్రీనగర్ పాఠశాల విద్యార్థినులు సీహెచ్ అన్విత, చరితలు ఇన్‌స్పైర్‌లో పాల్గొని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ మేరకు సదరు విద్యార్థినులను కలెక్టర్ ముజిమ్మిల్ ఖాన్ బుధవారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బహుళ అంతస్తు భవనాలను నిర్మించే కార్మికులకు ఉపయోగపడే విధంగా వీరు రూపొందించిన ప్రాజెక్ట్ విలువైనదని అన్నారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థినుల ప్రతిభ తమకు గర్వకారణమని అన్నారు. ప్రిన్సిపాల్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెయిరీ ఏర్పాటుపై సమావేశం

మధిర, జనవరి 22 : మున్సిపాలిటీ పరిధిలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఇందిరా మహిళా డెయిరీ కార్యక్రమాల గురించి తెలుసుకోవడానికి వరంగల్, హన్మకొండ జిల్లాల నుంచి అడిషనల్ డీఆర్‌డీవో కార్ సుధీర్, హన్మకొండ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు దాస్, అనిల్‌కుమార్, శ్రీకాంత్, సరిత, వరంగల్ జిల్లా నుంచి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్లు గీతారాణి, సురేష్ ఇందిరమ్మ డెయిరీ నిర్వాహకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో మధిర ఎంఎంఎస్ ఇందిరా డెయిరీ ఏపీఎం జే.లక్ష్మణరావు, మధిర మండల ఏపీఎం ఎం.శ్రీనివాసరావు, అధ్యక్షురాలు కృష్ణవేణి, డీసీవో ఆఫీస్ పర్సన్ ఇంచార్జి అసిస్టెంట్ డిజిష్టార్ కొండలరావు, మధిర నియోజకవర్గంలోని 5 మండలాల ఏపీఎంలు, సీసీలు, డైరీ సీసీలు, ఐఎండీ కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వెంకన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న తాతా మధు

తిరుమలాయపాలెం, జనవరి 22 : మండలంలోని పాపాయిగూడెంలో మృతుల కుటుంబాలను బుధవారం ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రేపాకుల వెంకన్న చిత్రపటం వద్ద నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం సొంటి వెంకమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. పిండిప్రోలులో అనారోగ్యానికి గురైన పరికపల్లి బుచ్చిరాములును పరామర్శించారు. కార్యక్రమంలో తిరుమలాయపాలెం సొసైటీ వైస్ చైర్మన్ చామకూరి రాజు, పిండిప్రోలు మాజీ ఎంపీటీసీ పులుగుజ్జు వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షకార్యదర్శులు పరికపల్లి చంద్రశేఖర్, రేపాకుల రవి, ముత్తయ్య పాల్గొన్నారు.

'మా నాన్న హీరో' పుస్తకావిష్కరణ

ఖమ్మం అర్బన్, జనవరి 22: ఖమ్మంలోని మోమినాన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు, బాలసాహితీవేత్త సయ్యద్‌షఫీ సంపాదకత్వంలో విద్యార్థులు రాసిన ముఖాముఖి ప్రక్రియలో 'మా నాన్న హీరో..' పుస్తకాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు ప్రసేన్, నారాయణ, వైవీ, జానకీకరణ, స్వరూపరాణి పాల్గొన్నారు.

జీఎస్ ప్రసాద్‌కు ప్రమోషన్

ఖమ్మం అర్బన్, జనవరి 22: భద్రాద్రి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న జీఎస్ ప్రసాద్‌కు సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ కల్పిస్తూ వరంగల్ ఆర్జేడీ కే.సత్యనారాయణ రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అత్యధిక కాలం ఖమ్మంలో విధులు నిర్వహించిన ఆయన.. ఇటీవలి బదిలీల్లో భద్రాద్రి జిల్లాకు వెళ్లారు. తాజాగా, ఆయనకు పదోన్నతి కల్పిస్తూ హనుమకొండ డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్‌గా నియమించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పెనుబల్లి, జనవరి 22: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లంకాసాగర్ పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సత్తెనపల్లి రవికుమార్(45) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాడు. ఒత్తిడిని తట్టుకోలేక సోమవారం సాయంత్రం కలుపుమందు తాగాడు. గమనించిన స్థానికులు వెంటనే ఖమ్మం తరలించి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు.

పదోన్నతులు కల్పించాలి

సత్తుపల్లిటౌన్, జనవరి 22: సింగరేణి సత్తుపల్లిలో ఐఎన్‌టీయూసీ కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఆదేశాల మేరకు జేవీఆర్‌సీహెచ్‌పీ డీజీఎం సోమశేఖర్‌కు ఫ్రీవేబిన్ ఆపరేటర్‌గా పదోన్నతి కల్పించాలని ఫిట్ సెక్రటరీ పోగుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీ.శ్రీనివాసరావు, పీ.షణ్ముఖరావు, వినయ్‌కుమార్, సంతోష్‌కుమార్, నాగేందర్, ఈశ్వర్, నగేష్ పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

ఖమ్మం, జనవరి 22: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీయూడబ్ల్యూజే - ఐజేయూ) డైరీని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తన కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో స్తంభాద్రి హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు, యూనియన్ బాధ్యులు కే.రాంనారాయణ, వనం వెంకటేశ్వర్లు, మైసా పాపారావు, మామిడాల భూపాలరావు, మొహినుద్దిన్, చెరుకుపల్లి శ్రీనివాస్, జనార్దనాచారి, కల్యాణ్, సత్యనారాయణ, రమేశ్, బుర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఒలింపియాడ్‌లలో హార్వెస్ట్‌కు అగ్రస్థాయి పతకాలు'

సత్తా చాటిన విద్యార్థులతో హార్వెస్ట్ కరస్పాండెంట్ రవిమారుత్

ఖమ్మం అర్బన్, జనవరి 22: రాష్ట్రీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీ పరీక్షలన్నింటిలోనూ తమ విద్యార్థులు అగ్రస్థాయిలో పతకాలు సాధించారని హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత పోపూరి రవిమారుత్ తెలిపారు. ఖమ్మంలోని తమ పాఠశాలలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో తమ విద్యార్థులు సాధించిన పతకాల గురించి వివరించారు. ముంబయిలో జరిగిన ఇన్ఫినిటీ మ్యాథ్స్ ఒలింపియాడ్‌ను బిట్స్‌పిలానీ, ఆదిత్యా గ్రూప్ సంయుక్తంగా నిర్వహించిన పరీక్షలో10 దేశాలు పాల్గొనగా.. భారతదేశం నుంచి హార్వెస్ట్ తరపున ఎనిమిది బృందాలు ఎంపికైనట్లు చెప్పారు. వీరిలో ఏడుగురు గోల్డ్, ముగ్గురు సిల్వర్, ఐదుగురు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు వివరించారు. అలాగే, విద్యార్థి విజ్జాన్ మంథాన్‌లో స్టేట్ క్యాంపులో తమ విద్యార్థులు మొదటి మూడు ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. అలాగే, డాక్టర్ ఏఎస్ రావు అవార్డులు, నేషనల్ సైన్స్ ఒలింపియాడ్, అమెరికన్ మ్యాథ్స్ ఒలింపియాడ్, రామానుజన్ మ్యాథ్స్ నేషనల్ చాలెంజ్, సింగపూర్ మ్యాథ్స్ ఒలింపియాడ్‌లలో కూడా తమ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి అభినందించారు.

శివాలయానికి నిధులు మంజూరు

కూసుమంచి, జనవరి 22 : కాకతీయుల కాలంనాటి శివాలయానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.3.35 కోట్లు మంజూరు చేయటం పట్ల ఆలయ కమిటీ సభ్యులు సంతోషం వ్యక్తంచేశారు. శివాలయంలో బుధవారం చైర్మన్ రేలా ప్రదీప్‌రెడ్డి, ఈవో కాముని శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కల్యాణ మండపానికి రూ.26 లక్షలు, పాకశాలకు రూ.8.50 లక్షలు, ఆఫీస్ స్టోర్‌రూంలకు రూ.15.5 లక్షలు, ఆర్చ్ గేట్‌కు రూ.14.50 లక్షలు, ప్రాకార గోడకు రూ.1.41 కోట్లు, సుభద మండపానికి రూ.1.15 కోట్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ మోహన్, దామోదర్‌రెడ్డి, వీరభద్ర, మాజీ ఎంపీటీసీ ఉపేందర్‌రావు, శ్రీనివాస్ యాదవ్, జనార్దన్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

త్వరలో మద్దులపల్లి మార్కెట్ ప్రారంభం

మాట్లాడుతున్న చైర్మన్ హరినాథబాబు

ఖమ్మం రూరల్, జనవరి 22 : వచ్చే నెల 10వ తేదీలోపు మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ నిర్మాణ పనులు పూర్తిచేసి ప్రారంభించనున్నట్లు మార్కెట్ చైర్మన్ బైరు హరినాథబాబు తెలిపారు. బుధవారం మద్దులపల్లి మార్కెట్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్ టూ గొల్లగూడెం, మార్కెట్ టూ ఆటోనగర్, మార్కెట్ టూ మద్దులపల్లి హైవేరోడ్ వరకు రూ.37 కోట్లతో అప్రోచ్ రోడ్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. మార్కెట్ డైరెక్టర్ పంతులునాయక్, నాయకులు పాల్గొన్నారు.

యూరియా కొరతను నివారించండి

కొణిజర్ల, జనవరి 22: జిల్లాలో యూరియా కొరతపై ఫెర్టిలైజర్స్ యూనియన్ నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి జిల్లాలో ఎదుర్కొంటున్న యూరియా కొరతపై వివరించారు. స్పందించిన మంత్రి తుమ్మల వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపికి ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలని ఆదేశించారు. అనంతరం సంబంధిత ఫెర్టిలైజర్ యూనియన్ నాయకులు వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి, అడిషనల్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో యూనియన్ నాయకులు నాగేశ్వరరావు, ప్రభాకర్‌చౌదరి, లక్ష్మీనారాయణ, సుదీర్, నగేష్, శ్రీనివాసరావు ఉన్నారు.

సైన్స్ ఉపాధ్యాయుడికి అవార్డు

కొణిజర్ల, జనవరి 22: పలు రకాల ఇన్నోవేటివ్ ప్రయోగాలకు ప్రోత్సహిస్తున్న కొణిజర్ల జడ్పీహెచ్ఎస్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు బాణోతు హనుమా గ్రామీణ ఇన్నోవేషన్ అవార్డుకు ఎంపికయ్యాడు. జనవరి 26 రిపబ్లిక్‌డే సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో సత్కరించనున్నారు.

మోసాలకు పాల్పడే ముఠా నుంచి తప్పించుకున్న యువత

మామిళ్లగూడెం, జనవరి 22: చండీగఢ్‌లో పలు మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠాకు చిక్కి పావులుగా మారిన యువతీ యువకులు తప్పించుకున్న ఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. 'ఇండియా బిజినెస్' పేరుతో చండీగఢ్ కేంద్రంగా మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠా.. బార్ కోడ్, క్యూఆర్ కోడ్ క్రియేషన్, డేటా ఎంట్రీ ఉద్యోగాలు ఇస్తామంటూ తెలుగు రాష్ట్రాలకు చెందిన కొందరు యువతీ యువకులకు ఆశ చూపింది. ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.3 వేల నుంచి రూ.70 వేల వరకు వసూలు చేసినట్లు తెలిసింది. ఇలా నగదు చెల్లించి ఆ ముఠా ఉచ్